ప్రజావాణి వినతులను వెంటనే పరిష్కరించాలి

- గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సత్యశారద
- మొత్తం దరఖాస్తులు 56

నల్లబెల్లి: కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న తాజా మాజీ సర్పంచులు

గిర్మాజీపేట, మార్చి 3: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎక్కువగా భూ సమస్యలపై 23, కలెక్టరేట్ సూపరింటెండెంట్–15, జిల్లా వ్యవసాయ శాఖ 11, డీడబ్ల్యూవో 2, డీసీఎస్‌వో నుంచి 5 దరఖాస్తులు మొత్తం 56 వచ్చాయి. పరిష్కరించలేని దరఖాస్తులను ఎందుకు పరిష్కరించలేదో దరఖాస్తుదారుడికి తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌వో విజయలక్ష్మీ, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్డీవో కౌసల్యదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఏవో అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

నల్లబెల్లి: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని మండల తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండల మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నానెబోయిన రాజారాం మాట్లాడుతూ ఐదేండ్ల పదవీకాలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో అనేక రకాల అభివృద్ధి పనులు చేశామని, ఆయా పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అయినా బిల్లుల చెల్లించకపోవడంతో అప్పులు తీర్చలేక ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 63 మంది సర్పంచులు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. మాజీ సర్పంచులు లావుడ్య తిరుపతినాయక్, తంగెళ్ల రవీందర్‌రెడ్డి, గూబ రాజు పాల్గొన్నారు.

ఆ టీచర్‌పై చర్యలు తీసుకోవాలి

ఖానాపురం: మండలంలోని దబీర్‌పేట ప్రాథమిక పాఠశాల విధులకు డుమ్మా కొడుతున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, బీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక నరేందర్ కోరారు. సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయుడు నర్సంపేటలో బిజినెస్ చేస్తూ నెలకు పది నుంచి పదిహేను రోజులే విధులు నిర్వర్తిస్తున్నాడని, పాఠశాలకు వెళ్లిన రోజుల్లోనూ ల్యాప్‌టాప్‌లో తన బిజినెస్ చేసుకుంటూ విద్యార్థులకు పాఠాలు బోధించడం లేదని పేర్కొన్నారు. స్వేరోస్ మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

తలనీలాల మాయంపై విచారణ చేపట్టాలి

పర్వతగిరి: మండలంలోని అన్నారం షరీఫ్ దర్గాలో ఇటీవల తలనీలాలు మాయం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తలనీలాలు రికవరీ చేసి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని కోరుతూ కలెక్టర్ సత్యశారదకు సోమవారం స్థానికులు జడల కృష్ణ, ఎండీ గౌస్ పాషా వినతిపత్రం సమర్పించారు. రెండేళ్లుగా అన్నారంలో తలనీలాలు వేలం లేకుండానే వక్ఫ్‌బోర్డు అధికారులు, నల్గొండకు చెందిన వ్యక్తితోపాటు అన్నారం గ్రామంలోని ఓ వ్యక్తితో కుమ్మక్కై అక్రమంగా అమ్ముకున్నారని పేర్కొన్నారు. వెంటనే విచారణకు ఆదేశించాలని కోరారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

శ్మశాన వాటిక స్థలాన్ని కాపాడాలి

వరంగల్: ఉర్సు హరిజన కాలనీ వాసులకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, స్థలాన్ని కాపాడాలని దళితకాలనీ వాసులు సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. 41వ డివిజన్‌లోని దళిత శ్మశాన వాటిక పూర్వకాలం నుంచే ఉందన్నారు. 2005లో మున్సిపల్ నిధులతో ప్రహరీ నిర్మించారని, ఇప్పుడు కొందరు కూల్చారన్నారు. సుమారు వెయ్యి గజాల స్థలం కబ్జా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ప్రహరీ కూల్చివేసిన గ్లోరియస్ మినిస్ట్రీస్ క్రైస్తవ సంస్థపై చర్యలు తీసుకోవాలని, గోడ మళ్లీ నిర్మించాలని డిమాండ్ చేశారు. దళిత శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ సభ్యులు పాలొన్నారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

వరంగల్, మార్చి 3 : నగరంలో తాగునీటి సరఫరాలో మంగళవారం అంతరాయం ఉంటుందని ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ధర్మసాగర్ నుంచి కేయూసీ, వడ్డేపల్లి, దేశాయిపేట ఫిల్టర్‌బెడ్‌లకు నీరు చేర్చే పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడిన నేపథ్యంలో వాటి పరిధి ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎనుమాములలో చోరీ

కాశీబుగ్గ, మార్చి 3: ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధి ఇందిరమ్మకాలనీ ఫేస్–2లోని తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. సీఐ అలే రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చెట్టుపల్లి రమాదేవి ఆదివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి మనవరాలు పుట్టింట్రుకలు తీసేందుకు వేములవాడకు వెళ్లింది. అదేరోజు రాత్రి గుర్తుతెలియని దొంగలు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ.18 వేల నగదు చోరీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

కరీమాబాద్, మార్చి 2: ఖిలావరంగల్ అగర్తా చెరువులో జారిపడి ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. శివనగర్‌లోని ఏసీరెడ్డి నగర్‌కు చెందిన కీర్తి సూరయ్య(65) అగర్తా వద్ద కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించాడు. నీటిలో శవమై తేలి కనిపించగా స్థానికులు మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు చేరుకొని పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కరీమాబాద్, మార్చి 3: ఈనెల 2న బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వచ్చి నగరంలోని సీబీసీ చర్చి వద్ద బస్సు దిగి రోడ్డు దాటుతుండగా కొంతం భద్రయ్య(82)ను ద్విచక్రవాహనం ఢీకొనగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించగా చికిత్సపొందుతూ సోమవారం మరణించాడు. గోదాసి అఖిల్ అతివేగంగా, అజాగ్రత్తగా బైక్ నడిపి ఢీకొనడం వల్లే భర్త మరణించాడని మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు

కరీమాబాద్, మార్చి 3: మామునూరులోని 4వ బెటాలియన్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో సోమవారం అధికారులకు, సిబ్బందికి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అడిషనల్ కమాండెంట్ సురేష్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసమే పోలీసులు

కరీమాబాద్, మార్చి 3: ప్రజల రక్షణ కోసమే పోలీసులు ఉన్నారని మామునూరు సీఐ రమేశ్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయమన్నారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా సమాచారం ఇవ్వాలని సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. పలు చోట్ల నిషేధిత పొగాకు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు తనిఖీ చేసి పత్రాలు పరిశీలించారు. తనిఖీల్లో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర పరిష్కారాన్ని చూపాలి

బల్దియా గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ జోనా

వరంగల్, మార్చి 3 : గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర పరిష్కారం చూపాలని అదనపు కమిషనర్ జోనా అధికారులను ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 55వ డివిజన్ భద్రకాళీ కాలనీ–2లో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ బావితో ఇబ్బందులు కలుగుతున్నాయని కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు అధికారుల ఫిర్యాదు చేశారు. పద్మాక్షినగర్‌లోని సర్వే నంబర్ 950/2,952/2/3లో ప్లాట్ కొనుగోలు చేసి మున్సిపల్ అనుమతులతో గృహాలు నిర్మించుకున్నామని, కొంతమంది 20 ఫీట్ల రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని, దీంతో రోడ్డు ఇరుకైపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారుతున్నదని, అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. మడికొండలోని శ్రీసాయి ఆర్చర్డ్ కాలనీలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కాలనీవాసులు విన్నవించారు. గత ప్రభుత్వం మేడే కానుకగా మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ.వెయ్యి వేతనం పెంచారని, అయితే పెరిగిన జీతం కేవలం పారిశుధ్య కార్మికులకు మాత్రమే ఇస్తున్నారని, అన్ని విభాగాల కార్మికులకు వర్తింపజేయాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. రంగంపేట మాతశ్రీ ఫర్నిచర్ లైన్‌లో సీసీ రోడ్డు శిథిలావస్థలో ఉన్నదని, అక్కడ కొత్తగా సీసీ రోడ్డు వేయాలని కాలనీ వాసులు కోరారు. అనంతరం అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్ వినతుల పరిష్కారంలో జాప్యం లేకుండా వింగ్ అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ గ్రీవెన్స్‌లో 63 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 31, ఇంజినీరింగ్ విభాగం 13, ప్రజారోగ్య విభాగం 6, పన్నుల విభాగం 8, తాగునీటి సరఫరా 4, హార్టికల్చర్ విభాగానికి ఒక వినతి వచ్చింది. గ్రీవెన్స్‌లో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, బయాలాజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర లింగం, హెచ్‌వో రమేశ్, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఎంహెచ్‌వో రాజేశ్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి ‘చల్లా’ పరామర్శ

నాగార్జునశర్మను పరామర్శిస్తున్న చల్లా

సంగెం, మార్చి 3: బీఆర్‌ఎస్ పార్టీ సంగెం గ్రామ అధ్యక్షుడు అప్పె నాగార్జునశర్మ కొద్దిరోజులుగా అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానాలో చికిత్సపొందుతున్నాడు. ఆయనను సోమవారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి డాక్టర్లను అడిగి తెలుసుకొని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, జకీర్‌అలీ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ

పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నెక్కొండ, మార్చి 3: మండల కేంద్రానికి చెందిన ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ బెజ్జంకి వెంకటేశ్వర్లు తల్లి వెంకటలక్ష్మి మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను సోమవారం సొసైటీ చైర్మన్ మారం రాముతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. వారిలో న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, సొసైటీ మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ ఈదునూరి యాకయ్య, మండల అధ్యక్షులు ఈదునూరి వెంకన్న, సీనియర్ నాయకులు గరికపాటి కృష్ణారావు, ఈదునూరి శ్రీనాథ్ ఉన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తా

కార్పొరేటర్ రవికి వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

కరీమాబాద్, మార్చి 3: డివిజన్‌లోని పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం పార్కులు అభివృద్ధి చేయాలని కోరుతూ ముకుందకాలనీ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో డివిజన్‌లోని పార్కులను ప్రజలకు ఉపయోగకరంగా మార్చేలా చర్యలు చేపడతానని చెప్పారు. మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


ట్రోఫీ, మెడల్స్, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

గిర్మాజీపేట, మార్చి 3: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రకాశ్ అన్నారు. ఈనెల 1, 2 తేదీల్లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ నిర్వహించిన ఇన్విటేషనల్ ఇంటర్–కాలేజ్ టోర్నమెంట్‌లో వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ బాలుర విద్యార్థులు కబడ్డీలో మొదటి బహుమతి పొందారు. కాగా నిర్వాహకులు విజేతలకు షీల్డ్, మెడల్స్, ప్రశంసాపత్రాలు అందించారు. వాగ్దేవి కళాశాల సీహెచ్ వాణిదేవి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి పీ అజయ్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు బానోత్ పవన్, కత్తుల శ్రీకాంత్, అంబటి నాగరాజు, షకీర్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట పీఏసీఎస్ పాలకవర్గం రద్దు

చెన్నారావుపేట, మార్చి 3: చెన్నారావుపేట సహకార సంఘం పాలకవర్గాన్ని రద్దు చేసినట్లు వరంగల్ డీసీఓ నీరజ సోమవారం తెలిపారు. పీఏసీఎస్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నాయని మండలంలోని రైతులు అధికారులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేసిన ఉన్నతాధికారులు నివేదిక ఇచ్చారు. దాని ఆధారంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలకవర్గాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక అధికారిగా ఈగ వెంకటేశ్వర్లును నియమించినట్లు పేర్కొన్నారు. మంగళవారం నుంచి నోడల్ అధికారి పాలన కొనసాగుతుందని తెలిపారు.

సంరక్ష హాస్పిటల్‌కు రెండు పీజీ సీట్లు కేటాయింపు


పీజీ వైద్యుడు హిమాలయ గుప్తాకు స్టెతస్కోప్, ఆప్రాన్ అందజేస్తున్న వైద్యులు

కాశీబుగ్గ, ఫిబ్రవరి 3: గ్రేటర్ వరంగల్ నగరంలోని నర్సంపేట్ రోడ్డు వెంకట్రామ జంక్షన్ సమీపంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు రెండు పీజీ (డీఎన్‌బీ) కోర్సు సీట్లను కేంద్ర ప్రభుత్వ మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ సంస్థ మంజూరు చేసినట్లు హాస్పిటల్ యాజమాన్యం తెలిపింది. ఎంసీసీ, డీజీహెచ్‌ఎస్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారిచే ఆర్థోపెడిక్ విభాగంలో రెండు పీజీ కోర్సు సీట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఆర్థోపెడిక్ విభాగంలో డీఎన్‌బీ సీట్లు మంజూరైన ఏకైక హాస్పిటల్‌గా తమదేనని తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీ నుంచి డీఎన్‌బీ కోర్సులో ప్రవేశం పొందిన డాక్టర్ హిమాలయగుప్తాకు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి ఆప్రాన్, స్టెతస్కోప్ బహూకరించారు. పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు. హాస్పిటల్ చైర్మన్ దొడ్డ రమేశ్, వైస్‌చైర్మన్ తిరుపతిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ దిడ్డి శ్రవన్‌కుమార్, అజిత్ మహ్మద్, బందెల మోహన్‌రావు, సంధ్య, లక్ష్మీనారాయణ, పోలా నటరాజ్ పాల్గొన్నారు.

కోతుల బోను ఏర్పాటు

‘నమస్తే తెలంగాణ’ కథనానికి స్పందన


బోను ఏర్పాటు చేస్తున్న జీడబ్ల్యూఎంసీ సిబ్బంది

గిర్మాజీపేట, మార్చి 3: ‘శివనగర్‌లో కోతుల బెడద.. పది రోజుల్లో ముగ్గురిపై దాడి’ శీర్షికన సోమవారం ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన కథనంపై జీడబ్ల్యూఎంసీ అధికారులు స్పందించారు. సోమవారం 34వ డివిజన్‌లో కోతులను పట్టుకోవడానికి బోను ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

టెన్త్ ప్రీ ఫైనల్స్ ఉదయమే నిర్వహించాలి

నర్సంపేట, మార్చి 3: రాష్ట్ర ప్రభుత్వం పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ఉదయమే నిర్వహించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ అన్నారు. టెన్త్ విద్యార్థుల ప్రీ ఫైనల్ పరీక్ష వేళల్లో మార్పులు చేస్తూ ఎస్‌సీఈఆర్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో మామిడి జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి జరిగే పదోతరగతి ప్రీ ఫైనల్ పరీక్ష వేళల్లో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు చేసిందని తెలిపారు. మధ్యాహ్నం 12.15గంటల నుంచి 3.15గంటల వరకు మార్చుతూ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫ్ డైరెక్టర్ సర్క్యులర్ రిలీజ్ చేసిందని పేర్కొన్నారు. మిట్ట మధ్యాహ్నం మండు టెండల్లో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. నర్సంపేట కార్యదర్శి రాకం రాకేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోల్ల అజయ్, కార్తీక్ ఉన్నారు.

శ్రీధరాచార్యులుకు జాతీయ పురస్కారం

పోచమ్మమైదాన్, మార్చి 3: వరంగల్ ఎల్‌బీ నగర్ ప్రభుత్వ మాసూం అలీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు తయ్యాల శ్రీధరాచార్యులుకు విశ్వశాంతి ఉగాది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీ ఆర్యాణి సకల వేదిక సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు సముద్ర, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ దూడపాక శ్రీధర్ అందజేశారు. శ్రీధరాచార్యులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాల్లో మంచి వ్యాఖ్యాతతోపాటు గాయకుడిగా అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో ఆనందం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మార్చి 3: ఆధ్యాత్మిక చింతనతో ఆనందంగా ఉండవచ్చని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని మైలారంలో గీత కార్మికుల ఇలవేల్పు కంఠ మహేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణోత్సవాలకు ఆయన హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ పూజా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు రంగు కుమార్, పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కోల కొమురయ్య, నవీన్‌కుమార్‌గౌడ్, నాగరాజు, అనిల్‌కుమార్, లేతాకుల రంగారెడ్డి, కోల సంపత్, బిల్ల వెంకట్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, గూడెల్లి వెంకటయ్య, గబ్బెట కొమురయ్య, చందునాయక్, గాడిపల్లి రాములు, అయిత రాంచందర్, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, చందు సతీష్ యాదవ్, ఎల్లస్వామి పాల్గొన్నారు.

స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి

- త్రిపుల్ ఆర్ రీజినల్ సదస్సులో మేయర్ సుధారాణి
- సిటీస్ 2.0 స్టేట్ లెవల్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్‌కు గ్రేటర్ ఎంపిక

ఒప్పంద పత్రాలను అందుకున్న సీడీఎంఏ టీకే శ్రీదేవి, మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మార్చి 3 : చారిత్రక వరంగల్‌ను స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దేందుకు వినూత్న ఆలోచనలతో ముందుకు పోతున్నట్లు మేయర్ గుండు సుధారాణి అన్నారు. కేంద్ర హౌసింగ్ ఎఫైర్స్ పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని జైపూర్ నగరంలో జరిగిన 12వ త్రిబుల్ ఆర్ అండ్ సర్క్యూలర్ ఎకానమీ ఫోరం ఆసియా అండ్ పసిఫిక్ జాతీయ సదస్సుకు ఆమె సీడీఎంఏ శ్రీదేవి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి హాజరయ్యారు. కేంద్ర మంత్రి మనోహన్‌లాల్ ఖట్టర్ ముఖ్యఅతిథిగా హాజరైన సదస్సు ప్యానల్ డిస్కర్షన్‌లో పాల్గొన్న మేయర్ నగరంలో రెడ్యూస్, రీయూజ్, రీ సైక్లింగ్ (త్రిపుల్ ఆర్) విధానంలో అమలు చేస్తున్న పద్ధతులపై వివరించారు. త్వరలోనే వేస్ట్ టూ ఎనర్జీ యూనిట్ ఏర్పాటుకు చొరవ తీసుకుంటామని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్క్యులర్ ఎకానమీ అంశంపై కమిషనర్ అశ్విని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్లాస్టిక్ నియంత్రణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా జ్యూట్ సంచుల వాడకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. రీ సైక్లింగ్‌లో నిరుపయోగంగా ఉన్న వస్తువులతో చిట్టి పార్కులు ఏర్పాటు చేశామని చెప్పారు. సిటీస్ 2.0లో భాగంగా క్లైమేట్ యాక్షన్ ప్లాన్ స్టేట్ లెవల్‌కు గ్రేటర్ ఎంపికైంది. సదస్సులో సీఎంహెచ్‌వో రాజారెడ్డి పాల్గొన్నారు.

షీల్డ్ బహూకరిస్తున్న ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

క్రీడా పోటీలతో ప్రతిభ వెలికి తీయొచ్చు

బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి, మార్చి 3: క్రీడా పోటీలతో క్రీడాకారుల్లో ప్రతిభ వెలికి తీయొచ్చని మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పూర్వీకులైన లేతాకుల తిరుపతమ్మ, బిల్ల లక్ష్మీ, లేతాకుల రాజమ్మ–సత్తిరెడ్డి స్మారకార్థం తన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ క్రీడా పోటీల ముగింపు వేడుకలు సోమవారం రాత్రి గ్రామంలోని జడ్పీ పాఠశాల సమీపంలో ఘనంగా నిర్వహించారు. రాయపర్తి జట్టు విజేతగా నిలిచిన రూ.30,116 నగదు, కప్ బహూకరించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలతో క్రీడాకారుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు మెరుగవుతాయన్నారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు లేతాకుల రంగారెడ్డి, రంగు కుమార్, సంది దేవేందర్‌రెడ్డి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, దశమంతరెడ్డి, కోల నాగరాజ్ గౌడ్, ఉల్లెంగుల శ్రీనివాస్, గౌతమ్‌రెడ్డి, గబ్బెట ప్రవీణ్ పాల్గొన్నారు. కాగా, రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉల్లెంగుల యాకయ్య–లక్ష్మి దంపతుల కుమారుడు, ఏఆర్ కానిస్టేబుల్ ఉల్లెంగుల రాజేశ్ గత ఏడాది మామునూర్ పోలీస్ బెటాలియన్‌లో జరిగిన విద్యుత్ ప్రమాదంలో మృతిచెందాడు. సోమవారం తమ నివాసంలోని రాజేశ్ విగ్రహం వద్ద కుటుంబ సభ్యులు చేసిన 33వ జయంతి వేడుకలకు ఆయన హాజరయ్యారు. గూడెల్లి వెంకటయ్య, తాళ్ల సోమిరెడ్డి, గజవెల్లి ప్రసాద్, భూక్యా సురేందర్ రాథోడ్‌నాయక్ పాల్గొన్నారు.

అనుమతి లేకుండా డీజేలు పెడితే కేసులు

వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

వరంగల్ చౌరస్తా, మార్చి 3: అనుమతి లేకుండా డీజేలు పెట్టి ప్రజలు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించిన వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. విద్యాసంవత్సరం చివరలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించేలా సౌండ్ పెడితే సహించేది లేదన్నారు. అనుమతులు లేకుండా డీజేలు పెట్టిన వారితోపాటు కార్యక్రమ నిర్వాహకులు, అనుతులు లేకుండా రోడ్లు ఆక్రమించి కార్యక్రమాలు నిర్వహించే వారిపై చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులు, గుండె సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారికి ఇబ్బందులు కలిగించొద్దని, ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే డీజేలను సీజ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఈవెంట్స్ ఆర్గనైజర్లు దృష్టిలో ఉంచుకోవాలని హెచ్చరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

నర్సంపేట, మార్చి 3: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నర్సంపేట సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కొత్త లక్ష్మీ నారాయణ ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 26న, మార్చి 1న పట్టణంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేయగా, చెన్నారావుపేట మండలం కోనాపురానికి చెందిన కళ్లెపు అరవింద్, నర్సంపేటకు చెందిన వలబోతుల నాగరాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడ్డారు. వారిని నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నర్సంపేట కోర్టులో హాజరు పరిచారు. ఈక్రమంలో మేజిస్ట్రేట్ కొత్త లక్ష్మీనారాయణ వారిద్దరికి మూడు రోజుల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించినట్లు వివరించారు.

రాయపర్తి ఇన్‌చార్జి ఎంఈవోగా శ్రీధర్

శ్రీధర్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

రాయపర్తి, మార్చి 3: వర్ధన్నపేట ఎంఈవో మామునూరి శ్రీధర్ రాయపర్తి ఇన్‌చార్జి ఎంఈవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈవోగా చేసిన నోముల రంగయ్య గత నెల 28న ఉద్యోగ విరమణ పొందారు. సీనియారిటీ, రిజర్వేషన్ల ప్రకారం మైలారం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అజ్మీరా ఉమాదేవిని రాయపర్తి ఎంఈఓగా చేరేందుకు ఉన్నతాధికారులు అడగ్గా అయిష్టత వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మండలంలో పూర్తి స్థాయి ఇన్‌చార్జి ఎంఈవో నియామకానికి కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున వర్ధన్నపేట ఎంఈవో శ్రీధర్‌కు రాయపర్తి ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనను రిటైర్డ్ ఎంఈవో నోముల రంగయ్య, ఎమ్మార్సీ సిబ్బంది శ్రీనివాస్, జేరిపోతుల యాకయ్య, అయిత శ్రీనివాస్ సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పురుగులమందు తాగి మహిళ ఆత్మహత్య

సంగెం, మార్చి 3: కుటుంబ తగాదాలతో మనస్తాపం చెంది ఓ మహిళ పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి ఎల్లమ్మ–బచ్చయ్య దంపతుల పెద్ద కూతురు గొల్లపల్లి రజిత(40)కు పదిహేనేళ్ల క్రితం వివాహమైన కొద్ది రోజులకే విడాకులై ఇంట్లోనే తల్లిదండ్రులతో ఉంటోంది. ఈనెల 1న కుటుంబం విషయంలో తల్లీ బిడ్డకు గొడవ జరిగింది. దీంతో క్షణికావేశంలో రజిత ఇంట్లోని పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందింది. మృతురాలి చెల్లె నాంపెల్లి రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మృతుడి కుటుంబానికి క్లాస్‌మేట్స్ ఆర్థికసాయం

మృతుడికి నివాళులు అర్పిస్తున్న క్లాస్‌మేట్స్

రాయపర్తి, మార్చి 3: మండలంలోని కొండూరుకు చెందిన చిర్ర నితిన్‌కుమార్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి స్నేహితులు ఆర్థికసాయం అందజేశారు. వర్ధన్నపేట శివారులోని శివానీ టెక్నో స్కూల్‌లో 2014–2015లో అతడితో పదో తరగతి వరకు కలిసి చదువుకున్న స్నేహితులు బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. తాము విరాళంగా సేకరించిన రూ.50వేల నగదును మృతుడి తల్లి చిర్ర ఉపేంద్ర, సోదరుడు చిర్ర కిశోర్‌కుమార్‌కు అందజేశారు. పెండ్యాల గణేశ్, కోటగిరి కౌశిక్, మహ్మద్ మున్వర్, ఆఫ్రీద్, మహేశ్‌కుమార్, సందీప్‌కుమార్, అఖిల్, విశాల్, సంగీత్, ప్రణయ్‌కుమార్, బ్రహ్మం, సాయిరాం, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వినికిడి సమస్యను సకాలంలో గుర్తించాలి

చెన్నారావుపేట, మార్చి 3: వినికిడి సమస్యను సకాలంలో గుర్తించి పరిష్కరించుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ సరోజ అన్నారు. సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వినికిడి సమస్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో ఈ సమస్యను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి వైద్యుల సలహాతో సమస్య అధిగమించవచ్చని తెలిపారు. వైద్యుల సలహా మేరకు వినికిడి యంత్రాలు వినియోగించాలని సూచించారు. మండలంలోని జోజిపేట నారాయణ తండాలో వైద్య శిబిరం నిర్వహించి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. సీహెచ్ఓ భద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్ సువార్త, స్టాఫ్‌నర్స్ హేమలత, లీలారాణి పాల్గొన్నారు.

‘పార్టీ పేరు వాడుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి’

కరీమాబాద్, మార్చి 3: ఎంసీపీఐ పేరు, ఓంకార్, బీఎన్‌రెడ్డి చరిత్రను వాడుకుంటూ అప్రతిష్టపాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య–ఎంసీపీఐ(యూ) ఉమ్మడి జిల్లా ప్రతినిధి బృందం సోమవారం మిల్స్ కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నంకు ఫిర్యాదు చేశారు. ఎంసీపీఐ (యూ) పొలిట్‌బ్యూరో సభుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ మోర్తాల చందర్‌రావు, సింగతి సాంబయ్య, లింగంపల్లి శ్రీనివాసరెడ్డి, మర్రెడ్డి వెంకట్‌రెడ్డి, పానుగంటి నర్సయ్యతోపాటు పలువురు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు, ఆర్థిక అరాచకత్వాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీరిని పార్టీ నుంచి బహిష్కరించామని, వీరిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరారు. గోనె కుమారస్వామి, పెద్దారపు రమేశ్, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, నర్ర ప్రతాప్, గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఇద్దరి అరెస్ట్

నిందితుల అరెస్ట్ చూపుతున్న ఏసీపీ నర్సయ్య

వర్ధన్నపేట, మార్చి 3: తాళం వేసి ఉన్న ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన యువకుడు జాడి శ్రీకాంత్ అక్కడి చికెన్‌సెంటర్‌లో పనిచేసేవాడు. వచ్చిన డబ్బులు జల్సాలకు సరిపోవడంలేదని చోరీలకు పాల్పడేవాడు. వర్ధన్నపేట ఫిరంగి గడ్డ, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోని ఓ ఇంట్లో 82గ్రాముల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1లక్షా 5వేల నగదు చోరీ చేశాడు. వీటిని మరో యువకుడు కొడెం గణేశ్ ఇంట్లో దాచిపెట్టాడు. నగలు అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేయాలని నిర్ణయించుకున్నారు. తొర్రూరు పట్టణంలో అమ్మేందుకు వెళ్తుండగా దమ్మన్నపేట వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. జాడి శ్రీకాంత్ గతంలోనూ ధర్మసాగర్‌లో చోరీకి పాల్పడగా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వివరించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సైలు చందర్, రాజు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED



★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565